క్లుప్తంగా

ఎంపీ కోటగిరికి వినతి



ఎంపీ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

దెందులూరు: కోట్లాది రూపాయలు విలువైన భూములను దానం చేసిన మొటుపర్తి సుబ్బారావు విగ్రహాన్ని, గ్రామ పొలిమేరలో ఆర్చ్‌ను ఏర్పాటు చేయాలని వైఎస్సార్ సీపీ దెందులూరు గ్రామాధ్యక్షుడు పోకల రాంబాబు, మానవత మండల గౌరవాధ్యక్షుడు సుగ్గిశెట్టి నూకరాజు ఎంపీ కోటగిరి శ్రీధర్‌కు వినతి పత్రం అందించారు. ఆదివారం మొటుపర్తి వారి ఇంటికి వచ్చిన శ్రీధర్‌ను కలిసిన నాయకులు మొటుపర్తి చేసిన సేవలకు గుర్తింపు లభించేలా కృషి చేయాలని కోరారు.

ఘనంగా భద్రావతి సమేత భావనారుషి కల్యాణోత్సవం



కొవ్వలిలో భద్రావతి సమేత భావనారుషి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు, భక్తులు

దెందులూరు: కొవ్వలిలోని భద్రావతి సమేత భావనారుషి స్వామి 36వ కల్యాణమహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. తొలుత ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు స్వామి వారికి వివిధ పుష్పాలతో విశేషాలంకరణ చేశారు. అనంతరంస్వామివారి కల్యాణం, అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కొవ్వలి, ఉండ్రాజవరం, దోసపాడు నుంచి ఈ ఉత్సవాలకు భక్తులు తరలివచ్చారు.

విద్యార్థికి ప్రతిభా పురస్కారం

పెదపాడు: విద్యాభ్యాసంలో అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన కొలిశెట్టి నాగేంద్రబాబుకు అప్పనవీడు మానవత శాఖ తరుపున ఆదివారం రూ.25వేల ప్రతిభా పురస్కారాన్ని అందించారు. పెదపాడు మండలంలోని అప్పనవీడులో మానవత అధ్యక్షుడు చక్కా సుబ్బారావు అధ్యక్షతన నెలవారీ సమావేశం నిర్వహించారు. మానవత చైర్మన్, రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు చేతుల మీదుగా రూ.25వేల నగదు పురస్కారం, జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని ఆదివారం అందించారు. దీంతోపాటు నాగేంద్రబాబు తల్లిదండ్రులను ఘనంగా దుశ్శాలువాతో సత్కరించారు. ఈకార్యక్రమంలో మానవత సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



ఉచిత కంటి వైద్య శిబిరం దృశ్యం

ఉంగుటూరు: లయన్స్ క్లబ్ ఆఫ్ చేబ్రోలు ఆధ్వర్యంలో నారాయణపురం లయన్స్ ఆడిటోరియంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో నిడదవోలు లయన్స్ కంటి ఆసుపత్రి వైద్యులు సేవలు అందజేశారు. 110 మందికి కంటి పరీక్షలు నిర్వహించి కళ్లజోళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు వి.ప్రతాప్, సీతాలు సత్యనారాయణ, గుండం బుల్లబ్బాయ్, బొమ్మిడి అప్పారావు, రామిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటో తిరగబడి ఇద్దరికి తీవ్ర గాయాలు



క్షతగాత్రురాలిని బయటకు తీస్తున్న దృశ్యం

ఉంగుటూరు: జాతీయ రహదారిపై ఉంగుటూరు టోల్ ప్లాజా వద్ద తాడేపల్లిగూడెం వైపు వెళ్లే ట్రక్కు ఆటో ఆదివారం తిరగబడింది. ఈ ట్రక్కులో ప్రయాణిస్తున్న బేతా నాగమణి, బేతా రాంజిలకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను హైవే అంబులెన్స్‌లో తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఏలూరుకు చెందిన వీరు తాడేపల్లిగూడెం వెళ్తుండగా ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను టోల్ ప్లాజా సిబ్బంది బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు.

చేతివృత్తిదారుల రాష్ట్ర సదస్సుకు తరలిరావాలి

ఏలూరు (టూటౌన్): విజయవాడ గాంధీనగర్‌లోని సోమవారం నిర్వహించే చేతివృత్తిదారుల రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని జిల్లా కన్వీనర్ పి.ఆదిశేషు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. చేతివృత్తిదారులకు జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించి వృత్తిదారులను ఆదుకోవాలని కోరుతూ ఏపీ చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సదస్సు విజయవంతం చేయాలని కోరుతూ ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచారం నిర్వహించామన్నారు.

జగనన్న కాలనీలు దేశానికే ఆదర్శం



పత్తేపురం జగనన్న కాలనీలో విద్యుత్ లైన్లు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: మన రాష్ట్రంలో ప్రభుత్వం నిరుపేదల కోసం నిర్మిస్తున్న జగనన్న కాలనీలు దేశానికే ఆదర్శమని, కాలనీలన్నీ పూర్తయితే కొత్త ఊళ్లు ఏర్పడతాయని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. ఆదివారం పత్తేపురం జగనన్న కాలనీలో రూ.15 లక్షలతో ఏర్పాటుచేసిన విద్యుత్ సదుపాయం, వీధిలైట్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకోసం ఇళ్లస్థలాలు ఇచ్చి, వాటిని మెరక చేసి, మౌలిక వసతులన్నీ కల్పించి ఇళ్లు కూడా నిర్మించి ఇస్తున్నారని దేశంలో మరెక్కడా ఇలాంటి ఏర్పాట్లు లేవన్నారు. ప్రతీ పేదవాడికి సొంత ఇల్లు నిర్మించి, వారిపేరున రిజిస్ట్రేషన్ చేసి ఇస్తున్నామని తెలిపారు. నియోజవర్గంలోని అన్ని గ్రామాలలో జగనన్న కాలనీలు ఏర్పాటు చేశామని ఇళ్ల నిర్మాణం ప్రగతిలో ఉందన్నారు. ఉగాదికి దాదాపు 50 శాతం ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నామన్నారు. అన్ని కాలనీల్లో రోడ్లు, విద్యుత్, నీటి సరఫరా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ధనుకొండ ఆదిలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కోడే కాశీ, మండల వైఎస్సార్ సీపి కన్వీనర్ సంకు సత్యకుమార్, ఎంపీటీసీ సభ్యురాలు బొక్కా వెంకటలక్ష్మి, గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు రుద్రరాజు అప్పలరాజు, సొసైటీ అధ్యక్షుడు పత్సమట్ల సతీష్‌కుమార్ రాజు, ఆర్‌బీకే అధ్యక్షుడు పొత్తూరి బెనర్జీప్రసాదరాజు, ఎంపీడీఓ ప్రకాష్ పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాలకు మానవత సేవలు



కొమ్మరలో మానవత సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ వెంకటరత్నం

గణపవరం: మానవత సంస్థ చేపట్టే సామాజిక సేవా కార్యక్రమాలను మారుమూల గ్రామీణ ప్రాంతాలకు విస్తరించాలని మానవత రీజియన్ చైర్మన్ కాకర్ల వినాయక అన్నారు. ఆదివారం గణపవరం మండల మానవత సంస్థ సర్వసభ్యసమావేశం జల్లికొమ్మరలో మండల మానవత అధ్యక్షుడు వంకాయల రామారావు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో వినాయక మాట్లాడుతూ మానవత సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలకు దాతలు తమవంతు సహకారం అందించాలని కోరారు. అలాగే సభ్యత్వాల సంఖ్యను కూడా బాగా పెంచి ఎక్కువ మందిని భాగస్వాములు చేయాలన్నారు. మండల అధ్యక్షుడు వంకాయల రామారావు మాట్లాడుతూ మానవత సంస్థ తరఫున ప్రతీ గ్రామంలో శీతలీకరణ పెట్టె, ప్రతీ మండలంలో శాంతిరథం ఏర్పాటు చేయాలన్నది లక్ష్యమన్నారు. జల్లికొమ్మర సర్పంచ్ కురెళ్ల వెంకటరత్నం మాట్లాడుతూ మానవత చేసే సేవా కార్యక్రమాలకు తమవంతు సహకారం అందిస్తామని చెప్పారు. వచ్చేనెలలో మండలంలో చేపట్టాల్సిన కార్యక్రమాలు, పదోతరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమ నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. ఈసమావేశంలో మాజీ సర్పంచ్ కురెళ్ల త్రిమూర్తులు, మానవత మండల కార్యదర్శి బుద్దారపు పుల్లయ్య, కోశాధికారి పెరుమాళ్ల ఆంజనేయులు, సభ్యులు అడ్డడ రామకృష్ణంరాజు, కాళ్లకూరి సత్యనారాయణ; మాదేపల్లి చిరంజీవి, కరుణానిధి, జనపరెడ్డి సత్యనారాయణ, మద్దాల పోతురాజు, మద్దాల నాగేశ్వరరావు, తంగెళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వట్టి వసంత్ మరణం తీరని లోటు

గణపవరం: మాజీ మంత్రి, సీనియర్ నాయకుడు వట్టి వసంత్ కుమార్ ఆకస్మిక మరణం జిల్లాకు తీరని లోటని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ ఇందుకూరి రామకృష్ణంరాజు అన్నారు. ఆదివారం ఆయన గణపవరంలో విలేకరులతో మాట్లాడుతూ రాజకీయాలలో విలువలకు ప్రాధాన్యత ఇచ్చి, అవినీతి మరకలు లేకుండా సుదీర్ఘకాలం రాజకీయాలలో అనేక పదవులు అలంకరించిన మంచి నాయకుడు వట్టి వసంతకుమార్ అని కొనియాడారు. వైఎస్ రాజశేఖరరెడ్డికి అత్యంత ఆప్తుడిగా రాజకీయరంగ ప్రవేశం చేసిన వసంతకుమార్ మంత్రిగా, ఎమ్మెల్యేగా ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. వట్టివసంతకుమార్ తండ్రి వట్టి పార్థసారధితో తనకు ఎంతో సాన్నిహిత్యం ఉండటంతో వసంతకుమార్‌తో తనకు ఎంతో అనుబంధం ఉండేదన్నారు. ఆయన మరణం తీరనిలోటని, కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వసంత్ మరణం పట్ల రాజకీయ పార్టీలకు అతీతంగా పలువురు నాయకులు సంతాపం తెలిపారు. రాజకీయాలలో నీతి, నిజాయితీలే ఆభరణాలుగా పని చేసిన వసంత కుమార్ నేటి తరం నాయకులకు ఆదర్శమని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్‌వీఎస్‌రాజు అన్నారు. పీసీసీ కార్యదర్శి పాతపాటి హరికుమార్ రాజు, గణపవరం ఎంపిపి అర్ధవరం రాము, వైఎస్సార్ సీపీ మండల బాధ్యులు పుప్పాల చినబాబు, మండల పార్టీ కన్వీనర్ దండు రాము, పార్టీ నాయకులు కాకర్ల శ్రీను, తోట శ్రీను, రొంగల శ్రీను, గాజుల వెంకటేశ్వరావు, సంకు చంటి, సంకు శ్రీనివాసరావు, డేగల కొండయ్య,సంకు చంటి, సంకు శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షుడు కొనిశెట్టి రమేష్, మండల వ్యవసాయ సలహాసంఘం చైర్మన్ కె.జగపతిరాజు తదితరులు సంతాపం తెలిపారు.

వసంతకుమార్ లేని లోటు పూడ్చలేనిది

భీమడోలు: ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి వట్టి వసంతకుమార్ మరణం రాష్ట్రానికి తీరని లోటని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రావిపాటి సత్యశ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ప్రజాప్రతినిధులు వట్టి మృతదేహంపై పూలమాలలు వేసి తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఉంగుటూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా రెండు సార్లు పని చేసిన వసంతకుమార్ నిస్వార్థ ప్రజాసేవ చేసి అందరి హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. ఆయన మరణం జిల్లా, నియోజకవర్గానికి తీరని లోటన్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి అనుచరుడు, స్నేహితుడుగా సన్నిహితుడుగా మెలిగిన వసంతకుమార్ జిల్లా అభివృద్ధిలో కీలకంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, పూళ్ల సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్, ఎఎంసీ వైస్ చైర్మన్ పులిచర్ల వెంకటకృష్ణారావు, ఎంపీటీసీ సభ్యుడు గంటా శ్రీనివాసరావు, గొండు కృష్ణ చైతన్య, బొల్లారపు జ్ఞాన రమ్య పవన్, గుండుగొలను సొసైటీ చైర్మన్ వగ్వాల భాస్కర్, వైసీపీ నేతలు పాము మాన్‌సింగ్, సవలం నాని, వరినేడి సాయి, ఏపూరి రాంబాబు, రామిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి వసంత్‌కుమార్‌కు ఘన నివాళి



మాజీ మంత్రి వసంత్‌కుమార్ భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న వాసు, తదితరులు

ద్వారకాతిరుమల : రాష్ట్ర మాజీ మంత్రి వట్టి వసంత్‌కుమార్ మృతి ప్రజలకు తీరని లోటని వైఎస్సార్ సీపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు పలువురు పేర్కొన్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలో ద్వారకాతిరుమల మండలం కలసి ఉన్నప్పుడు వసంత్‌కుమార్ మండల అభివృద్ధికి చేసిన కృషిని ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు గుర్తు చేసుకున్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, నాయకులు పెద్దిరెడ్డి జ్యోతిశ్రీనివాస్, బొండాడ వెంకన్నబాబు, గుర్రాల లక్ష్మణ్, మానుకొండ సుబ్బారావు, దాకారపు బంగారమ్మ, అగ్గియ్య, కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ పాకలపాటి త్యాగభీమేశ్వరరావు, మొగతడకల ప్రభాకరరావు, శంకాబత్తుల పాపారావు, పుప్పాల మురళీధరరావు తదితరులు భీమడోలు మండలం పల్లపూరులోని ఆయన నివాసానికి వెళ్లి వట్టి వసంత్‌కుమార్ భౌతిక కాయాన్ని సందర్శించి, నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ఎమ్మెల్యే బాలరాజు సంతాపం

బుట్టాయగూడెం : మాజీ మంత్రి వట్టి వసంత కుమార్ మృతి పట్ల ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆదివారం సంతాపం తెలిపారు. వైఎస్సార్ కేబినెట్‌లో వసంతకుమార్ పర్యాటక మంత్రిగా పనిచేస్తున్న సమయంలో తాను ఎమ్మెల్యేగా పనిచేశానని ఆ సందర్భంలో వారిద్దరి మధ్య ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

కుష్టు నివారణకు అందుబాటులో చికిత్స



వేగవరంలోని డామియన్ లెప్రసీ సెంటరులో మాట్లాడుతున్న ఫిజియోథెరిపిస్ట్ రాంబాబు

దెందులూరు: కుష్టువ్యాధిగ్రస్తుల సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణకు, వారి మెరుగైన జీవన విధానానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఫిజియోథెరిఫిస్ట్ డాక్టర్ రాంబాబు, డామియన్ లెప్రసీ సెంటర్ సిస్టర్ రోజీ అన్నారు. ఆదివారం వేగవరం డామియన్ లెప్రసీ సెంటరులో ప్రపంచ లెప్రసీడే సందర్భంగా సామాజిక న్యాయ సాధికారిత మంత్రిత్వ శాఖ ఉమా ఎడ్యుకేషనల్ టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో దివ్యాంగుల పునరావాస కేంద్రం సాంకేతిక నిపుణుల బృందం అవగాహన సదస్సు నిర్వహించారు. కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించేందుకు ఈ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని వారన్నారు. కుష్టు వ్యాధి చికిత్స కోసం మందులు, ఆధునిక చికిత్సా విధానం అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రష్మిత, అకౌంటెంట్ నాగరాజు, జయలక్ష్మి పాల్గొన్నారు.

సాయం అందించాలని ఎమ్మెల్యేను కోరిన ఫొటోగ్రాఫర్లు



ఎమ్మెల్యే ఎలీజాకు వినతిపత్రం అందజేస్తున్న జంగారెడ్డిగూడెం ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని పాత మున్సిపాలిటీ ఆలయం వద్ద ఉన్న సచివాలయంలో ఎమ్మెల్యే వీఆర్ ఎలీజాను ఆదివారం జంగారెడ్డిగూడెం ఫొటోగ్రాఫర్స్, వీడియో గ్రాఫర్స్ మిక్సింగ్ యూనిట్ సభ్యులు కలిశారు. ఫొటోగ్రాఫర్ అనిల్‌కుమార్ వైద్యానికి సహాయం చేయాలని ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ ఆసుపత్రిలో అయ్యే ట్రీట్మెంట్‌కు సంబంధించిన ఎస్టిమేట్ కాపీ ఇవ్వాలని, సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఫొటోగ్రాఫర్లు కాకర్ల రామచంద్రరావు, జంగారెడ్డిగూడెం ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సోమరాజు సూరిబాబు, చండేశ్వరరావు రాజు, పవన్, వాసు, శ్రీను, ప్రసాద్, నాగసూరి బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయం



వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న దృశ్యం

చింతలపూడి : మండలంలోని ప్రగడవరం పంచాయతీలో మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ టి.భూపతి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. శిబిరంలో జనరల్ మెడిసిన్ వైద్యులు పి.రామకృష్ణ, పిల్లల వైద్య నిపుణులు పి.రవీంద్రబాబు, గైనకాలజిస్ట్ డా.భవ్య, కంటి వైద్య నిపుణులు కె.సురేంద్రబాబు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందచేశారు. కార్యక్రమంలో మానవత గౌరవ డైరెక్టర్ డా ఎ.సత్యన్నారాయణ, చైర్మన్ ఎ.అప్పారావు, వైస్ చైర్మన్ ఎం.శామ్యూల్, అధ్యక్షుడు కె నాగచిన్నారావు, టీవీఎస్ఎన్ రాజు, ఎం.సత్తిబాబు, పి.సోమశేఖర్, ఎం.సత్తిబాబు, పి.సోమశేఖర్, కె.గాంధి, కృష్ణారెడ్డి, కె.సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

గృహసారథులు అంకిత భావంతో సేవలందించాలి



దెందులూరులో వైఎస్సార్‌సీపీ గృహసారథుల సమావేశంలో మాట్లాడుతున్న పోకల రాంబాబు

దెందులూరు: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి, అభివృద్ధికి క్షేత్రస్థాయిలో గృహసారథులు కీలకమని వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు పోకల రాంబాబు నివాసంలో నిర్వహించిన సమావేశంలో కామిరెడ్డి నాని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే అన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరికి మంచి పేరు తీసుకువచ్చేలా వలంటీర్లు, గృహసారథులు, జగనన్న సచివాలయ కన్వీనర్లు కృషి చేయాలన్నారు. సమన్వయంతో పార్టీ నియమనిబంధనలకు లోబడి సేవలందించాలన్నారు. దెందులూరు ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత మాట్లాడుతూ గృహసారథులు, జగనన్న సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, నాయకులు, కార్యకర్తల సమష్టి కృషితో వచ్చే ఎన్నికల్లో విజయం సాధించేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు తోట విజయకుమారి, పులిపాటి ఆనంద్, తాళ్ళూరి నాగరాజు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కొంగర రత్నకుమార్ అబ్బాస్, జిల్లా కార్యదర్శి చల్లా మేరీరాజు, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు తొత్తడి వేదకుమారి, సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు, సచివాలయ మండల కన్వీనర్ కట్టా ఏసుబాబు, నాయకులు గోరిపర్తి శ్రీనివాసరావు, పులిపాటి శ్యామలాదేవి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ఐదు శాతం నిధులు కేటాయించాలి

ఏలూరు (టూటౌన్): కేంద్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి బడ్జెట్‌లో ఐదు శాతం నిధులు కేటాయించాలని, మందులపై జీఎస్టీ ఎత్తి వేయాలని ఏపీ మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ జీవీడీ కృష్ణ కోరారు. స్థానిక పవరుపేటలోని సీఐటీయూ కార్యాలయంలో యూనియన్ వార్షిక సభ ఏలూరు బ్రాంచి యూనియన్ అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పేదలకు విద్య, వైద్యం అందుబాటులో తీసుకురావడంలో వైఫల్యం చెందిందని విమర్శించారు.

ఉత్సాహంగా చదవడం మాకిష్టం



నీతి కథలు వివరిస్తున్న మండే సుధాకర్

భీమడోలు: భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం ఉత్సాహంగా సాగింది. భీమడోలు శాఖా గ్రంథాలయంలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 30 మంది బాలబాలికలు సామూహిక పుస్తక పఠనంలో పాల్గొని ఎంపిక చేసుకున్న పుస్తకాలను చదివారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమాలకు సత్యం ఫౌండేషన్ అధినేత బాలనాగు విజయసారథి చక్కని ప్రోత్సాహాన్ని అందిస్తున్నారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ మాట్లాడుతూ పుస్తకాలను చదవడం వల్లే కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమాల్లో పూళ్ల, గుండుగొలను గ్రంథపాలకులు డీఎస్‌వీ అమర్‌నాథ్, జి.నాగమణి, సభ్యులు కడగల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి స్టడీ మెటీరియల్ వితరణ



పుస్తకాలు, మెటీరియల్ అందజేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం : నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెంకు చెందిన మసాబత్తుల సాహితి కోనసీమ జిల్లాలోని అమలాపురం కిమ్స్ కాలేజీలో మెడిసిన్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. అయితే గత సంవత్సరమే మెడిసిన్ చేయాల్సి ఉన్నా ఆర్థిక స్తోమత సహకరించక ఆగిపోయింది. విషయం తెలుసుకున్న దాతలు ఈ సంవత్సరం కాలేజీ ఫీజు చెల్లించగా, గణేష్ రాయుడు (ఎంఎస్ ఆర్థో) సుమారు రూ.20 వేల విలువైన ప్రథమ సంవత్సర మెటీరియల్‌ని తన తండ్రి శేషగిరిరావు జ్ఞాపకార్థం ఆమెకు అందజేశారు. జంగారెడ్డిగూడెం రోటరీ క్లబ్ సభ్యుడు విజయ్ ద్వారా స్టడీ మెటీరియల్‌ని వైఎస్సార్‌సీపీ నాయకులు చెల్లుబోయిన శ్రీనివాస్ చేతుల మీదుగా విద్యార్థినికి అందజేశారు. ఈ సందర్భంగా గణేష్ రాయుడికి, ఫీజు కట్టిన దాతలకు సాహితీ కృతజ్ఞతలు తెలిపింది.

ఎంపీడీవో మంగతాయారుకు సన్మానం



దర్భగూడెంలో ఎంపీడీఓ మంగతాయారును సత్కరించిన దృశ్యం

బుట్టాయగూడెం : గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ అధికారిగా అవార్డు తీసుకున్న ఎంపీడీవో మంగతాయారును ఆదివారం జీలుగుమిల్లి మండలం దర్భగూడెం సచివాలయంలో ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తే ప్రజాదరణ లభిస్తుందని సొసైటీ అధ్యక్షుడు కొల్లూరి రాంబాబు అన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మంగతాయారు మాట్లాడుతూ ఈ అవార్డుతో మరింత బాధ్యత పెరిగిందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సున్నం ఉషారాణి, ఉపసర్పంచ్ కేతిరెడ్డి రాఘవ రెడ్డి, ఎంపీటీసీలు కంచర్ల సుధారాణి, సున్నం సురేష్, కార్యదర్శి సుబ్రహ్మణ్యం, ఈఓపీఆర్‌డీ దేవప్రియుడు పాల్గొన్నారు.

కుంగ్‌ఫూ, కరాటేలో విద్యార్థుల ప్రతిభ



సాధించిన మెడల్స్‌తో హర్షిత స్కూల్ విద్యార్థులు

కామవరపుకోట : ఇటీవల కృష్ణా జిల్లాలో జరిగిన ఓపెన్ కుంగ్‌ఫూ, కరాటేలో భాగమైన కర్రసాములో మండలంలోని తడికలపూడి హర్షిత ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. 10 మంది గోల్డ్ మెడల్స్, 8 మంది సిల్వర్ మెడల్స్, 5 మంది బ్రౌన్ మెడల్స్ సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ నందిగామ రాణి తెలిపారు. వీరికి శిక్షణ ఇచ్చిన గురువు ఖరీదు సాంబయ్యను కరస్పాండెంట్ రాణి చంద్రశేఖర్, పాఠశాల సిబ్బంది అభినందించారు.

భవన కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ఏలూరు (టూటౌన్): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, సంక్షేమ బోర్డు ద్వారా అమలయ్యే పథకాలను కొనసాగించాలని ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్.రమణారావు, ప్రధాన కార్యదర్శి ఆర్‌వీ నరసింహారావు కోరారు. యూనియన్ రాష్ట్ర కమిటీ సమావేశం స్థానిక నరసింహారావుపేటలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగింది. రాష్ట్ర కోశాధికారి కేవీ గోపాలరావు, ఎం.సుందర్‌బాబు, ఎర్ర రాంబాబు, పిల్లి నరసింహారావు, మండా సూరిబాబు హాజరయ్యారు.

ఆక్రమణల తొలగింపునకు రంగం సిద్ధం



ఆశ్రం వద్ద రోడ్డు మార్జిన్‌లో వెలసిన దుకాణాలు

ఏలూరు రూరల్: ఆశ్రం ఆసుపత్రి వద్ద రోడ్డుపై ఆక్రమణలను తొలగించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఏలూరు ఆర్డీఓ కె.కిషోర్ పర్యవేక్షణలో ఏలూరు తహసీల్దార్ బి.సోమశేఖర్, ఈఓపీఆర్డీ ఎం.సరళ కుమారి శనివారం సిబ్బంది, పోలీసులతో కలిసి ఆక్రమణలను పరిశీలించారు. ట్రాన్స్‌కో అధికారులతో చర్చించి దుకాణాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయించారు. అనంతరం ఆక్రమణదారులను పిలిచి ప్రశ్నించారు. కొంతకాలంగా ఆశ్రం వై-జంక్షన్ పరిసరాల్లో కొంతమంది రోడ్డు పక్కన షెడ్లు నిర్మించి హోటల్, కిరాణ మాల్ పేరుతో వ్యాపారాలు చేస్తున్నారు. వ్యాపారం పెరగడంతో క్రమేపీ రోడ్డు మార్జిన్ సైతం ఆక్రమించి షెడ్లను పెద్దవిగా మార్చారు. ఈ దుకాణాల వద్ద వినియోగదారులు ద్విచక్రవాహనాలు, కార్లు నిలిపివేస్తుండటంతో బస్సులు, ఇతర వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. దీనిని గుర్తించిన కలెక్టర్ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో అధికారులు ఆక్రమణలను పరిశీలించారు. షెడ్ల వెనక గోదావరి కెనాల్‌ను సైతం ఆక్రమించి తడికలతో మెరక చేసినట్టు గుర్తించారు. సోమవారం ఆక్రమణదారులను గుర్తించి నోటీసులు జారీ చేయాలని ఆర్డీఓ పాలగూడెం గ్రామాధికారులను ఆదేశించారు.

బ్యాంకు ఉద్యోగుల సమ్మె తాత్కాలిక వాయిదా

ఏలూరు (టూటౌన్): ఆల్ ఇండియా బ్యాంకు ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 30, 31 తేదీలలో జరుప తలపెట్టిన దేశవ్యాప్త సమ్మె వాయిదా పడిందని ఏఐటీయూసీ ఏలూరు జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు, ఏఐబీఈఏ జిల్లా అధ్యక్షులు దుగ్గిరాల శ్రీనివాసమోహన్ ఆదివారం తెలిపారు. ఇండియన్ బ్యాంక్‌ల అసోసియేషన్ ప్రతినిధులు ఈ నెల 31న బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులను చర్చలకు ఆహ్వానించినందున సమ్మె వాయిదా వేశారని ఏఐబీఈఏ జాతీయ నాయకులు ప్రకటించినట్లు పేర్కొన్నారు.